
# సంతృప్తి



-పోలిశెట్టి ఓబయ్య

"ఏమండీ! ఇంట్లో బియ్యం నిండుకున్నాయి. రైతు బజారుకెళ్లి పట్రండి" అంది శ్రీమతి వంట గదిలోంచి వరండాలో వాలుకుర్చీలో కూర్చుని వారపత్రిక తిరగేస్తున్న నాతో.

"ఇంటికెదురుగా కొట్టుందిగా...అక్కడ కొను" అన్నాను నేను.

"నిన్న ఎదుటి కొట్లో రెండు కేజీలు సోనా మసూరి బియ్యం, కేజీ నలభై రూపాయల లెక్కన తెచ్చా. మన పక్కింటి ప్రభావతి మొగుడు రైతు బజారులో అదేరకం బియ్యం కిలో ముప్పై అయిదుకు తెచ్చాడుట. మీరు వెళ్లి ఒక ఇరవై అయిదు కేజీలు తెస్తే మనకు వంద ఇరవై అయిదు రూపాయలు ఆదా అవుతాయి. ఆ డబ్బుతో వారానికి సరిపడా కూరగాయలు కొనుక్కు రండి. వెళ్లేప్పుడు సిటీ బస్సులో వెళ్లండి. వచ్చేటప్పుడు ఆటోలో రండి" అంది శ్రీమతి.

ఉద్యోగం నుండి రిటైరై ఇంట్లో ఖాళీగా ఉంటూ వూరికే గోళ్లు గిల్లుకుంటూ కూర్చోవడం కంటే అలా రైతు బజారులో కూరగాయలు, బియ్యం పట్టుకొస్తే డబ్బు ఆదా అవుతుంది, శరీరానికి కాస్త ఎక్సర్‌సైజ్ అయినట్లు ఉంటుంది.

ఆవిడ పొదుపుగా సంసారం లాక్కురాబట్టేగా నా ముప్పై ఏళ్ల ఉపాధ్యాయ జీవితం ఎలాంటి ఒడుదుడుకులు లేకుండా హాయిగా గడిచిపోయింది.

ఇద్దరు కొడుకులు బిటెక్ చేసి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు అయ్యారు. బిటెక్ చదివిన అమ్మాయిలతో పెళ్లిళ్లు చేసాను.

కోడళ్లు కూడా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు. నలుగురూ బెంగుళూరులో ఉద్యోగాలు చేస్తున్నారు.హైదరాబాద్‌లో సొంత ఇల్లు ఏర్పరచుకున్నాను. వచ్చే పెన్షన్ మాకు సరిపోతుంది.

***

ఒక వెయ్యి రూపాయల నోటు, నాలుగు పది రూపాయల నోట్లు జేబులో పెట్టుకుని సంచీ చేతిలో పట్టుకుని రైతు బజారుకు బయల్దేరాను. సిటీ బస్సెక్కి ఎర్రగడ్డ రైతు బజారు స్టేజీలో దిగి లోపలకు నడిచాను.

ఆదివారం సెలవు దినం కావడంవల్ల ఉద్యోగస్తులంతా సరుకులు కొనడానికి రైతు బజారుకు వచ్చారు. నేను ఆకుకూరలమ్మే ఆవిడ దగ్గరకు వెళ్లాను.

ఆవిడ మెంతికూర పదిరూపాయలకు ఆరుకట్టలు అంది. నేను బేరమాడి ఎనిమిది కట్టలు ఇమ్మన్నాను.ఆవిడ సరేనంది. ఎనిమిది కట్టలు సంచీలో వేసుకుని పది రూపాయల నోటిచ్చాను. ప్రక్కనే టమోటా దుకాణం చాలా బిజీగా ఉంది.

చూస్తూ నిలబడితే లాభం లేదని నేనూ ఒక బుట్ట తీసుకుని కావాల్సిన టమోటాలు ఏరి ఒక కిలో తూకం వేయమనిచెప్పి బుట్ట అతని చేతికిచ్చాను.

డబ్బిద్దామని జేబులో చేయి పెట్టాను. పది రూపాయల నోట్లు మూడున్నాయి. వెయ్యి రూపాయల నోటులేదు.

దుకాణం అతనికి రెండు పదిరూపాయల నోట్లిచ్చి వెంటనే కూరలమ్మే ఆవిడ దగ్గరకు వెళ్లాను.

"అమ్మా! ఇక్కడ డబ్బేమైనా పడుంటే చూసావా?"

"లేదు బాబూ... నాకు మీరిచ్చింది పది రూపాయల నోటే" అందావిడ.

ఆకు కూరలకు డబ్బు చెల్లించడానికి చొక్కా జేబులో చేయిపెట్టినప్పుడు వెయ్యి రూపాయలనోటు జేబులోనే వుంది. టమాటే దుకాణం దగ్గరే ఏదో అయిందని రూఢి చేసుకున్నాను.

నుదుట చెమట పోసింది, గుండె వేగంగా కొట్టుకోసాగింది. ముందు బియ్యం కొని అక్కడే పడేసి తరువాత కూరగాయలు కొనడానికి వెళ్లి వుంటే డబ్బు పోయేదికాదు అనుకుంటూ నన్ను నేనే నిందించుకున్నాను. ఆశ చావక రైతు బజారు మేనేజర్ని కలిసాను.


ఆయన విషయం విన్న వెంటనే స్పందించారు. మైకులో అనౌన్స్ చేసాడు.

"రిటైర్డ్ టీచరు రంగనాథంగారి వెయ్యిరూపాయల నోటు పోయింది. ఎవరికైనా దొరికి వుంటే ఆఫీసులో మేనేజరుగారిని కలవండి. తగిన బహుమానం ఇవ్వబడును."

నన్ను తన ఎదుట కుర్చీలో కూర్చోబెట్టాడు. మంచినీళ్లు ఇప్పించాడు. పదినిముషాల తరువాత మరోమారు మైకులో చెప్పాడు. అరగంట దాటినా ఫలితం శూన్యం.


"సార్! మీ నోటు పోలేదు. దొంగిలించబడింది. ఈమధ్య ఇక్కడ జేబులు కొట్టే కుర్రాళ్లు తిరుగుతున్నారు. మీరే జాగ్రత్తగా ఉండాల్సింది" అన్నాడు మేనేజరు.

తానొకటి తలిస్తే దైవమొకటి తలచినట్లు బియ్యం రైతుబజార్లో కొంటే వంద రూపాయలు ఆదా అవుతుందని వస్తే అసలుకే మోసం వచ్చింది.



## మంచి అవకాశం

టబు హిందీలో కంటే తెలుగు చిత్రాల్లోనే ఈమధ్య ఎక్కువగా కనిపిస్తోంది. అయితే అప్పుడప్పుడు హిందీ చిత్రాల్లో నటిస్తున్న టబుకి ఈమధ్యనే మంచి ఆఫర్ ఒకటి వచ్చిందిట. నందితాదాస్ దర్శకత్వంలో నటనకు మంచి ప్రాధాన్యత వున్న పాత్రను టబు పోషిస్తోందిట. ఇద్దరు అక్కాచెల్లెళ్ల జీవితానికి సంబంధించిన ఇతివృత్తంలో రూపొందే ఈ చిత్రంలో ఆమెకు చెల్లెలిగా విద్యాబాలన్ నటించే అవకాశం వుందంటున్నారు .



ఇక చేసేదేముంది... బసెక్కి కూర్చుని అనవసరంగా మార్కెట్‌కు వచ్చి డబ్బు పోగొట్టుకున్నాను కదా అని ఆలోచిస్తూ ఉండిపోయాను. నేను దిగవలసిన స్టేజీ రాగానే బస్ దిగి తిన్నగా ఇంటికి వచ్చాను.

గేటు తీసిన శబ్దం అయింది కాబోలు శ్రీమతి వచ్చి గుమ్మంలో నిలబడింది.

"ఏమండీ... ఆలస్యమయిందే. బియ్యం పట్టుకు రాలేదేమిటి? మరచిపోయారా?'' అంది.

"మర్చిపోలేదు. కానీ బియ్యం తీసుకువద్దామని తీసుకువెళ్లిన వెయ్యి రూపాయల నోటును జేబులోంచి ఎవరో కొట్టేసారు'' అన్నాను సోఫాలో కూర్చుంటూ.

"అలాగా... పోతే పోయిందిలెండి. ఎవరు ఖర్చు పెట్టాలని దాని మీద రాసుందో అలాగే జరుగుతుంది. మీరు బాధపడకండి. గుట్టల్లోనో, చెట్లలోనో నోటు పడిపోతే నిరుపయోగమైందని బాధపడాలి. రైతుబజార్లో పడిపోయింది. ఎవరో తీసుకునే వుంటారు. డబ్బు ఉండేదే ఖర్చు పెట్టడానికి. మీరు దిగులు పడవద్దు. లేవండి భోజనానికి'' అంటూ డైనింగ్ రూంలోకి నడిచింది మా ఆవిడ.

ఆమె విశాల హృదయానికి నేనెంతగానో పొంగిపోయాను.

***

సాయంకాలం ఆరుగంటలయింది.

మా ఆవిడ పెరట్లో వంట పాత్రలు శుభ్రం చేస్తోంది. నేను వరండాలో కుర్చీలో కూర్చుని పోయిన నోటు గురించి ఆలోచిస్తున్నాను. ఇంతలో గేటు తీసిన శబ్దమయింది.

నేను గేటుకేసి చూసాను. ఓ ఇరవై ఏళ్ల కుర్రాడు గేటు తీసుకుని లోపలకు వచ్చి "నమస్కారం సార్. నేను కట్టెల రాంబాబు కొడుకు రమేష్‌నండీ... మీ స్టూడెంట్‌ని''

"నాతో ఏమైనా పనుండి వచ్చావా?''

"కాదు సార్. మీరు నన్ను క్షమించాలి. నేను తప్పు చేసాను'' అంటూ నా కాళ్లమీద పడ్డాడు. అతని కన్నీళ్లు నా కాళ్లమీద పడడం, నేను గమనిస్తూనే వున్నాను.

"ఎందుకు క్షమించాలి? నీవు నాకు చేసిన అపకారమేమిటి? కాస్త వివరంగా చెప్పు'' అన్నాను.

"ఇవాళ రైతు బజార్లో మీరు టమోటాలు ఏరుతున్న సమయంలో నేను అక్కడే తచ్చాడుతున్నాను. మీ జేబులోని వెయ్యిరూపాయల నోటు మీద నా దృష్టి పడింది. మీ జేబు నుండి నోటు తీసి నా జేబులో వేసుకున్నాను. మేనేజర్ అనౌన్స్‌మెంట్ విన్నప్పుడు తెలిసింది అది మీ నోటని. ఆ క్షణంలో నేను చాలా బాధపడ్డాను. నేను చిన్న చిన్న దొంగతనాలు చేసి బ్రతుకుతున్నాను. మీరు నాకు చదువు చెప్పిన గురువని మిమ్మల్ని పోల్చుకోలేకపోయాను. మా నాన్న నన్ను స్కూలుకు పంపనని తొమ్మిదో తరగతి చదివేటప్పుడు మొండికేసాడు. మీరు అప్పుడు మా నాన్నకు చెప్పి నన్ను స్కూలుకు పంపించేట్లు చేసారు. మాస్టారూ! మీరు దయచేసి మీ నోటు తీసుకుని నన్ను క్షమించానంటేనే నేను వెళ్తాను'' అంటూ వెయ్యిరూపాయల నోటు నాకివ్వబోయాడు. ఆ నోటును చూడగానే అది నాదని పోల్చుకున్నాను.


"వద్దు బాబూ. నీవు కష్టపడి నా నోటు కాజేసావు. ఆ క్షణంలో అది నీదయింది. నా అజాగ్రత్తకు నేను మూల్యం చెల్లించుకున్నాను. ఉదయం నుంచి బాధపడ్డాను. ఇక మరచిపోతాను. అయితే నాదొక రిక్వెస్ట్. జేబు దొంగవైన నీవు ఎప్పుడో ఒకప్పుడు పోలీసులకు దొరుకుతావు. వాళ్లు నీ పూర్వాపరాలు అడుగుతారు. అప్పుడు నీవు మహాత్మాగాంధీ స్కూల్లో చదివానని మాత్రం చెప్పకు. అలా చెబితే ఆయన ఆత్మ క్షోభిస్తుంది'' అంటూ రమేష్ భుజం తట్టి ఇవ్వజూపిన నోటు వాడి జేబులో పెట్టి పంపించాను.

నా మాటల ప్రభావమో, లేక తను చేస్తున్న పని తప్పని తెలుసుకున్నాడో ఏమోగానీ రమేష్ పూర్తిగా మారిపోయాడు.

వాళ్లింట్లోనే కూరగాయల కొట్టు పెట్టుకుని నిజాయితీగా బ్రతుకుతున్నాడు.

ఉద్యోగ ధర్మం ప్రకారం కొందరి విద్యార్థులను ప్రయోజకులుగా తీర్చిదిద్దిన తృప్తి ఆనాడు నాకు కలిగింది. రిటైరయ్యాక నేను రమేష్ జీవితంలో తెచ్చిన మార్పు నాకు సంతృప్తినిచ్చింది.

★



## దాహం...దాహం

గ్లోబల్ వార్మింగ్‌వల్ల భూవాతావరణం వేడెక్కిపోతోందన్న సంగతి తెలిసిందే. ఆఖరికి ఉత్తర ధృవంలో జీరోకి క్రింద ఉండాల్సిన ఉష్ణోగ్రత వేసవిలో 15 డిగ్రీల సెల్సియస్‌కు చేరుకుంటోందంటే భవిష్యత్తులో భూమి ఎంత వేడెక్కిపోతుందో ఊహించడం కష్టం. సరాసరిన 2080 నాటికి భూవాతావరణ ఉష్ణము 4 డిగ్రీలు పెరగనున్న నేపథ్యంలో ప్రపంచంలో 300 కోట్లమందికి త్రాగే నీరు దొరక్క వారి జీవితం నరకప్రాయమవుతుందని ఇటీవల ఐక్యరాజ్యసమితిలో జరిగిన వాతావరణ సమారోహంలో నిపుణులు తమ అభిప్రాయాన్ని వెలిబుచ్చారు.

-తటవర్తి

